రక్తదాతలే ప్రాణదాతలు
ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

నేటి రక్తదాతలే..రేపటి ప్రాణదాతలని తిరుపతి ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ అన్నారు. ఏర్పేడు వద్ద ఉన్న తిరుపతి ఐఐటీలో ఐఐటీ అనుబంధ నేషనల్ సర్వీస్ స్కీమ్, ఎన్టీఆర్ ట్రస్ట్ సంయుక్తంగా శనివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించచారు. ఈ శిబిరంలో ఐఐటీ విద్యార్థులు, పెద్ద ఎత్తున అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. సుమారు 100 యూనిట్ల రక్తాన్ని ఈ శిబిరం సందర్భంగా సేకరించింది. రక్తదాన ఆవశ్యకతను సత్యనారాయణ వివరించారు. స్వచ్ఛందంగా మనం చేస్తున్న రక్తదానం భవిష్యత్తులో ఆపదలో ఉన్న ఎంతోమంది అమాయకుల ప్రాణాలను నిలబెడుతుందని వివరించారు.

చంద్రయాన్ -3 బ్రోచర్‌ను ఆవిష్కరించిన జేఈవో సదా భార్గవి

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా రాణించాలి

ఎస్‌జిఎస్ షార్ స్పేస్ ఎగ్జిబిషన్‌లో సదా భార్గవి

ప్రజాశక్తి - క్యాంపస్

టిటిడి విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులు అంతరిక్ష విజ్ఞానంపై అవగాహన పెంచుకుని, ఆసక్తిగల వారు శాస్త్రవేత్తలుగా రాణించాలని టిటిడి జేఈవో సదా భార్గవి పిలుపు నిచ్చారు. ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల్లో భాగంగా శ్రీగోవిందరాజస్వామి ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన స్పేస్ ఎగ్జిబిషన్‌ను జేఈవో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్రీవారి ఆశీస్సులతో టిటిడిలోని 33 విద్యాసంస్థల్లో 29 వేల మంది విద్యార్థులు వివిధ రకాల విద్యను అభ్యసిస్తున్నారని తెలియజేశారు. అంతరిక్ష పరిశోధనలు చేస్తున్న శాస్త్రవేత్తల కషిని అభినందించారు. టిటిడి పాఠశాలల్లో చదివే విద్యార్థులందరూ శ్రీహరికోటలోని షార్‌ను సందర్శించేందుకు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సందర్భంగా చంద్రయాన్-3 పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ పోస్టరును విద్యార్థులందరూ తమ ఇళ్లలో అంటించుకుని స్ఫూర్తిని పొందాలని సూచించారు. టిటిడి విద్యార్థులకు షార్‌లో ఇంటర్న్ షిప్ తోపాటు తగిన ఉద్యోగావకాశాలు కల్పించాలని షార్ అధికారులను కోరారు. టిటిడి విద్యార్థులు మన సంస్కతి సంప్రదాయాల పట్ల అవగాహన పెంచుకుని విద్యార్థి దశ నుంచే వాటిని పాటించాలన్నారు. టిటిడి విద్యాశాఖ అధికారి డాక్టర్ ఎం.భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల ప్రాధాన్యతను వివరించారు. మొదటి మానవ నిర్మిత ఉపగ్రహం గురించి తెలియజేశారు. విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని వీక్షించి స్ఫూర్తిని పొందాలని, శాస్త్రీయ దక్పథాన్ని పెంపొందించు కోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో షార్ సీనియర్ సైంటిస్ట్ శంభుప్రసాద్, షార్ గ్రూప్ డైరెక్టర్ గోపికష్ణ, షార్ టెస్ట్ ఫెసిలిటీస్ మేనేజర్ డాక్టర్ టి.శ్రీనివాసరెడ్డిలు శ్రీహరికోటలో జరిగే ప్రయోగాలన్నింటినీ ఈ ప్రదర్శనలో ఉంచామని, విద్యార్థులు శ్రద్ధగా తిలకించి అర్థం చేసుకోవాలని సూచించారు. షార్ నిర్వహించిన క్విజ్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన 24 మంది టీటీడీ విద్యార్థులకు జేఈవో బహుమతులు ప్రదానం చేశారు. అతిథులను సన్మానించారు. టిటిడి పాఠశాలల్లోని 8, 9, 10వ తరగతులకు చెందిన సుమారు 1400 మంది విద్యార్థులు ఎగ్జిబిషన్‌ను తిలకించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చంద్రయ్య, కష్ణమూర్తి, సురేంద్ర, పద్మావతమ్మ, సంధ్య పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన విద్యార్థులు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ

స్మైల్ ఫౌండేషన్ నిర్వహించిన ఎన్‌ఎక్స్‌ప్లోరర్స్ కార్నివాల్లో తిరుపతి జిల్లాలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల నుండి ఎంపికైన 59 మంది ప్రతిభావంతులైన విద్యార్థులు స్టమ్ (సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, గణితం) రంగాలలో తమ వినూత్న ఆలోచనలను ప్రదర్శించారు. మొత్తం 35 "మార్పు ప్రాజెక్టులు" ఇక్కడ ప్రదర్శించబడ్డాయి, వీటిని 2,500 మంది విద్యార్థుల వినూత్న ఆలోచనలు నుండి ఎంపిక చేశారు. ఎన్‌ఎక్స్‌ప్లోరర్స్ జూనియర్ ప్రోగ్రామ్ అనేది గ్లోబల్ ఫ్లాగ్‌షిప్ సోషల్ ఇన్వెస్ట్‌మెంట్ విద్యా కార్యక్రమం. స్మైల్ ఫౌండేషన్ ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి, నెల్లూరు, తెలంగాణలోని ఖమ్మం, హనుమకొండ, జనగాం, మహబూబాబాద్, వరంగల్ జిల్లాలు, కేరళలోని త్రిసూర్ జిల్లాల్లోని 203 పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. 6, 7 అకడమిక్ గ్రేడ్‌లలోని 10 నుండి 12 సంవత్సరాల వయస్సు గల 25వేల మంది పాఠశాల విద్యార్థులకు ప్రయోజనం చేకూరుస్తోంది. తిరుపతి జిల్లా స్థాయి కార్నివాల్ లో , రోజువారీ జీవితంలో పర్యావరణ అనుకూల వినియోగ వనరులతో పాటుగా నీరు, శక్తి, ఆహార పరిరక్షణ, సరైన వినియోగం వంటి అంశాల పట్ల పలు ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సైన్స్ అధికారి (తిరుపతి) భాను ప్రసాద్ మాట్లాడుతూ "స్మైల్ ఫౌండేషన్ నిర్వహిస్తున్న ఎన్‌ఎక్స్‌ప్లోరర్స్ కార్యక్రమం మన పిల్లలను భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దడంలో కీలకపాత్ర పోషి స్తుందన్నారు. తిరుపతి మండల విద్యాధికారి మాట్లాడుతూ "ఈ గ్లోబల్ ప్రోగ్రామ్‌ను తిరుపతి పాఠశాలలకు తీసుకువచ్చినందుకు స్మైల్ ఫౌండేషన్, షెల్‌ను అభినందించారు. అనంతరం ప్రతిభ చాటిన విద్యార్థులకు అవార్డులు ప్రదానం చేశారు.

విద్యార్థుల ప్రదర్శనలు

రాజమండ్రిలో నారా భువనేశ్వరిని కలిసిన తిరుపతి మాజీ ఎంఎల్ఎ సుగుణమ్మ

తిరుపతిలోనే పవన్ పోటీ

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో



'తిరుపతి నుంచి పోటీ చేయి' అని జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు సూచించినట్లు విశ్వసనీయ సమాచారం. తిరుపతి ప్రజలు అప్పట్లో ఎన్టీఆర్‌ను, తరువాత కొణిదెల చిరంజీవిని ఆదరించారని, తొలి ప్రాధాన్యత తిరుపతికే ఇచ్చి కేంద్రీకరించాలని చెప్పినట్లు తెలుస్తోంది. జనసేన, టిడిపి కలయిక నేపథ్యంలో తిరుపతి వరకూ గ్రీన్‌సిగ్నల్ జనసేనకు ఇచ్చేసినట్లే.

ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో జనసేన, టిడిపి పొత్తులు, సీట్లు గురించి చర్చ నడుస్తోంది. మదనపల్లి, తిరుపతి, చిత్తూరు ప్రాంతాల్లో అసెంబ్లీ స్థానాలను జనసేన కోరినట్లు సమాచారం. తిరుపతి లోక్‌సభనూ జనసేన ఆశిస్తోంది. ఈ నేపథ్యంలో తిరుపతిలో ప్రస్తుత ఇన్‌ఛార్జి, మాజీ ఎంఎల్ఎ సుగుణమ్మ, టిడిపి రాష్ట్ర నాయకులు వూకా విజయకుమార్, టిటిడి మాజీ బోర్డు మెంబర్ ఒవి రమణ పోటీ పడుతున్నారు. వారితో పాటు పొత్తులో భాగంగా జనసేన నుంచి డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, తిరుపతి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కిరణ్‌రాయల్ ఆశిస్తున్నారు. అధికార పార్టీని బలంగా ఎదుర్కోవాలంటే తిరుపతి లాంటి ప్రాధాన్యత గల నియోజకవర్గంలో పవన్‌కల్యాణే సరైన అభ్యర్థిగా చంద్రబాబు భావించినట్లు తెలుస్తోంది. బలిజ సామాజికవర్గం ఎక్కువగా ఉన్న ఈ నియోజకవర్గంలో సాలిడ్‌గా పవన్‌కల్యాణ్‌కు ఓట్లు పడతాయని, విద్యాకేంద్రంగా ఉన్న తిరుపతిలో యువత ఓట్లు జనసేనకు మళ్లించేలా వ్యూహంలో ఉన్నారు. ఏదిఏమైనప్పటికీ బాబు వేసిన 'స్కెచ్' చూస్తుంటే పవన్‌కల్యాణ్ తిరుపతి నుంచే పోటీ చేస్తారనుకోవచ్చు.

నరేంద్ర కుమార్‌కు డాక్టరేట్ ప్రదానం

ప్రజాశక్తి - క్యాంపస్

శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయంలో ఇంజినీరింగ్ కళాశాల ఈఈఈ పరిశోధక విద్యార్థి వి నరేంద్ర కుమార్ కు డాక్టరేట్ డిగ్రీ ప్రదానం చేస్తున్నట్లు సిఇ మూడే దామ్లానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈఈఈ విభాగం సీరియర్ ఆచార్యులు సిహెచ్ చెంగయ్య పర్యవేక్షణలో " ఇన్వెస్టిగేషన్ ఆన్ రిడక్షన్ ఆఫ్ జనరేషన్ కాస్ట్ బై ఇంప్రూవింగ్ బాయిలర్ కెపాసిటీ థర్మల్ పవర్ స్టేషన్స్ యూజింగ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నిక్స్" అనే అంశంపై పరిశోధనా గ్రంధాన్ని వర్సిటీకి సమర్పించినట్లు వెల్లడించారు. నరేంద్ర కుమార్ పలు జాతీయ, అంతర్జాతీయ పరిశోధనా జర్నల్స్ లలో అనేక పరిశోధన పత్రాలను ప్రచురించినట్లు వివరించారు.

మఠం భూమిలో ఆక్రమణల కూల్చివేత

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):

చంద్రగిరి మండలం మిట్టపాలెం గ్రామ రెవెన్యూ లెక్కదాఖలా సర్వేనెంబర్ 593/1, 2లో లలితాపీఠం వెనుక వైపున తిరుపతి శ్రీ స్వామి హాథీరాంజి మఠానికి చెందిన దాదాపు రెండు ఎకరాల భూమిలో అక్రమ నిర్మాణాలను మఠం ఫిట్ పర్సన్, డిప్యూటీ కలెక్టర్ రమేష్ నాయుడు ఆధ్వర్యంలో శనివారం కూల్చివేశారు. ఈ సందర్భంగా మఠం ఫిట్ పర్సన్ రమేష్ నాయుడు మాట్లాడుతూ శ్రీ స్వామి హాథీరాంజి మఠానికి చెందిన భూములలో జరుగుతున్న ఆక్రమణలను దశలవారీగా తొలగిస్తూ వస్తున్నామన్నారు. అందులో భాగంగా మిట్టపాలెంలో అక్రమ నిర్మాణాలను తొలగించామన్నారు.

బెల్ ఇంజినీర్లతో ఈవిఎంలు పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి - రేణిగుంట

బెల్ ఇంజినీర్లతో ఈవిఎం ల అక్సెప్టేన్స్ టెస్ట్ ప్రొసీజర్ ప్రారంభమైందని జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. శనివారం రేణిగుంట మండలంలోని రామకష్ణాపురం వద్ద గల సెంట్రల్ వేర్ హౌసింగ్ కార్పోరేషన్ కాంపౌండ్ లో గల ఈవిఎం గోడౌన్‌ను బెల్ కంపెనీ ప్రతినిధులు ఈవీఎం లకు అక్సెప్టేన్స్ టెస్ట్ ప్రొసీజర్ పరీక్షలు నిర్వహించనున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి ఎస్డిసి శ్రీనివాసులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి ఈవీఎం గోడౌన్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ గోడౌన్లో భద్రపరచబడిన ప్రతి ఈవిఎంల కంట్రోల్ యూనిట్లను బ్యాలెట్ యూనిట్లను అక్సెప్టేన్స్ టెస్ట్ ప్రొసీజర్ ద్వారా బెల్ ఇంజినీర్లు నేటి నుండి పరీక్షించనున్నారని జిల్లా కలెక్టర్ తెలిపారు. వివి ప్యాట్ ల పరీక్ష పూర్తి అయిందని, బెల్ కంపెనీ నుండి జిల్లాకు చేరుకుని గోడౌన్ లో భద్రపరచ బడిన 6780 బ్యాలెట్ యూనిట్లు 4270 కంట్రోల్ యూనిట్లకు అక్సెప్టేన్స్ టెస్ట్ ప్రొసీజర్ ను బెల్ ఇంజినీర్లు నేటి నుండి చేపట్టి మూడు నుండి నాలుగు రోజుల్లో పూర్తి చేయనున్నారని రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోడౌన్ ను తెరిచి వాటిని పరిశీలించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో రాజకీయ పార్టీల నుండి వైఎస్ఆర్ సీపీ ప్రతినిధి ప్రభాకర్, టీడీపీ ప్రతినిధులు మురళీకష్ణ, రేణిగుంట తాసిల్దార్ ఉదయ సంతోష్ పాల్గొన్నారు.

పకడ్బందీగా జగనన్న ఆరోగ్య సురక్ష : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

సుస్థిర అభివద్ధి సూచికల లక్ష్యాలను సంబంధిత శాఖలు అందిపుచ్చుకోవాలని, ఎత్తు, బరువు తక్కువ గల పిల్లలను, ఎదుగుదల లేని పిల్లలను అలాంటి లోపాల నుండి బయటపడేలా, బడి బయట పిల్లలు అందరూ బడిలోనే ఉండేలా చర్యలు తీసుకోవాలని, తల్లి బిడ్డ ఎక్స్ప్రెస్ పై, ప్రభుత్వ వైద్యశాలల్లో ఆరోగ్యశ్రీ సేవల పై అవగాహన కల్పించి వైద్య సేవలు మరింత పెంచాలని, త్వరలోనే జరగనున్న సామూహిక గహ ప్రవేశాలకు సంబంధించి జిల్లాలో కాయం లేఅవుట్ ఆర్చి నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పన వంటివి త్వరితగతిన పూర్తి చేయాలని, బాల్య వివాహాల నివారణకు తగిన చర్యలు చేపట్టాలని, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె. వెంకటరమణా రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం ఉదయం సిఎస్ క్యాంపు కార్యాలయం, విజయవాడ నుండి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా. కె .ఎస్. జవహర్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్ల తో వర్చువల్ విధానంలో సమీక్ష నిర్వహించారు. సిపిఓ ప్రేమచంద్రా రెడ్డి, జిల్లా గ్రామ వార్డు సచివాలయం ఇంఛార్జి అధికారిణి సుశీలా దేవి, పిడి లు ఐసిడిఎస్ జయలక్ష్మి , హౌసింగ్ వెంకటేశ్వర రావు, డిఆర్డిఎ జ్యోతి, మెప్మా రాధమ్మ, డిఈఓ శేఖర్, డి ఐ ఓ శాంత కుమారి, డిఎంహెచ్ఓ శ్రీహరి, రుయా ఆసుపత్రి సూపరింటెండెంట్ రవి ప్రభు, ప్రసూతి ఆసుపత్రి సూపరింటెండెంట్ పార్థ సారథి పాల్గొన్నారు.

తిరుపతి గాంధీ విగ్రహం ఎదుట యూనియన్లకు అతీతంగా జర్నలిస్టులు, దళిత, ప్రజాసంఘాల నిరసన

అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

తిరుపతిలో జర్నలిస్టుల నిరసన

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం జర్నలిస్టులను అరెస్టు చేసి, వారిపై ఉప చట్టం కింద తప్పుడు కేసులు బనాయించి భయభ్రాంతులకు గురిచేయాలని చూస్తోందని, అయితే అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని జర్నలిస్టు నేతలు ఉద్ఘాటించారు. తిరుపతి బస్టాండ్ సమీపంలోని గాంధీ విగ్రహం వద్ద 'న్యూస్‌క్లిక్'పై దాడులను నిరసిస్తూ ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్, ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్, రైతు, దళిత ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శనివారం నిరసన జరిగింది. ఈ సందర్భంగా జర్నలిస్టు నాయకులు ప్రసాద్, జనార్ధన్, వళిగళం గోపి మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రచయితలు, కవులు, కళాకారులు, జర్నలిస్టులపై దాడులు ఎక్కువయ్యాయన్నారు. వాస్తవాలను రాస్తున్న జర్నలిస్టులను అణచివేయడం, చంపేందుకు వెనుకాడటం లేదని, అందులో భాగంగానే గౌరీలంకేష్‌ను గతంలో హతమార్చారని గుర్తు చేశారు. ఢిల్లీలోరైతులు చేస్తున్న పోరాటానికి సంబంధించి కేంద్రం చేస్తున్న కుట్రను ఎప్పటికప్పుడు ప్రగతిశీల పత్రికలకు అందించిన న్యూస్‌క్లిక్‌ను 2021 నుంచి వేధిస్తూనే ఉందన్నారు. జర్నలిస్టులను ఉగ్రవాదులుగా ముద్ర వేయడం సరికాదన్నారు. నిరసనకు సిపిఎం నగర కార్యదర్శి టి.సుబ్రమణ్యం, సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, నాయకులు పెంచలయ్య, విశ్వనాథ్, ఆర్‌పిఐ రాష్ట్ర అధ్యక్షులు పి.అంజయ్య సంఘీభావం తెలిపారు. జర్నలిస్టు సంఘాల నాయకులు గిరిధర్, ఆదిమూలం శేఖర్, కె.గిరిబాబు, మునిరాజా, నరేంద్రరెడ్డి, నరేంద్ర, రాధాక్రిష్ణ, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సఫాయికర్మచారి సంక్షేమంపై ప్రత్యేక దృష్టి : జేసీ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

మున్సిపల్ కమిషనర్లు సఫాయికర్మచారి సంక్షేమంపై ప్రత్యేక దృష్టి పెట్టాలనీ జేసీ డికెబాలాజీ అన్నారు. శనివారం మధ్యాహ్నం కలెక్టరేట్‌లో సఫాయికర్మచారి విజిలెన్స్ కమిటీ మొదటి సమావేశం జేసీ అధ్యక్షతన ఎస్‌పి పరమేశ్వరరెడ్డితో కలిసి నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ మునిసిపల్ కమిషనర్లు సఫాయికర్మచారి సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధపెట్టాలన్నారు. రాష్ట్రంలో అదనంగా ఒహెచ్‌సి పేరతో వారి ఆరోగ్య పరిరక్షణ కోసం ఎక్కడా లేని విధంగా అదనంగా ఆరువేలు మంజూరు చేస్తున్నారని, ఇన్స్యూరెన్స్ ఏర్పాటు చూడాలని సూచించారు. చట్టప్రకారం వారికి అందాల్సిన పనిముట్లు నాణ్యతతో ఉండేలా చూడాలన్నారు. డిఆర్ఓ పెంచలకిషోర్, ఆర్‌డిఒలు కనక నరసారెడ్డి, రామారావు, కిరణ్‌కుమార్, తిరుపతి కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వరరెడ్డి, మున్సిపల్ కమిషనర్లు, కమిటీ సభ్యులు ధనశేఖర్ పాల్గొన్నారు.

ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో అగ్రగామి 'ఆర్‌సిఆర్'

- నాణ్యమైన విద్యా బోధన,అడ్మిషన్లలో ముందంజ
- సబ్జెక్టు నిపుణులైన అధ్యాపకులచే బోధన
- వర్సిటీ పరిధిలో ప్రతి సెమిస్టర్‌లో అత్యుత్తమ ఫలితాలు
- ఆహ్లాదకరమైన వాతావరణంలో తరగతులు
- ప్రతిఏటా విద్యార్థులకు క్యాంపస్ ప్లేస్‌మెంట్లు

ప్రజాశక్తి - క్యాంపస్

కళాశాల డైరెక్టర్ వి. రవికుమార్ చౌదరి

తిరుపతి జిల్లా కరకంబాడి రోడ్డులోని ఆర్‌సిఆర్ కళాశాల మేనేజ్మెంట్ కోర్సులకు అగ్రగామిగా గత 15 సంవత్సరాలుగా వెలుగొందుతోందని కళాశాల డైరెక్టర్ వి. రవికుమార్ చౌదరి పేర్కొన్నారు. 'ప్రజాశక్తి' తో ఆయన మాట్లాడుతూ విద్యాహబ్‌గా విరాజిల్లుతున్న కరకంబాడి రోడ్డులో ఆర్‌సిఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ప్రస్తుత విద్యా సంవత్సరానికి ఎంబీఏ కోర్సులో 180 సీట్లు, ఎంసీఏ కోర్సులో 180 సీట్లు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. ఇక్కడ విద్యార్థులకు మానవతా విలువలతో కూడిన గుణాత్మకమైన విద్యను, నాణ్యమైన శిక్షణ, సుశిక్షితులైన, సబ్జెక్టు నిపుణులైన అధ్యాపకులచే బోధన తరగతులు అందించబడతాయన్నారు. ఆర్ సి ఆర్ కళాశాల ఆహ్లాదకరమైన వాతావరణంలో ఏర్పాటు చేయబడిందని, నూతన డిజిటల్ తరగతి గదులు, అత్యాధునిక పరికరాలతో కూడిన కంప్యూటర్ ల్యాబ్‌లు, ఇతర ల్యాబొరేటరీ వంటి సౌకర్యాలు ఉన్నాయన్నారు. ఎల్సిడి ప్రొజెక్టర్ ద్వారా విద్యార్థులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయనీ వెల్లడించారు. కళాశాలలో విద్యార్థులకు ప్రత్యేకమైన సెమినార్ హాలు, డిజిటల్ లైబ్రరీ, బస్సు సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఐఐటి లోని సీనియర్ అధ్యాపకులచే కమ్యూనికేషన్ స్కిల్స్, సెల్ఫ్ డెవలప్మెంట్, సెల్ఫ్ రిలయన్స్ వంటి అంశాల పైన ప్రత్యేకమైన శిక్షణ ఇవ్వబడుతుందని, క్యాంపస్ ప్లేస్మెంట్లు ఉపాధి అవకాశాలు కూడా ఎక్కువగా తమ కళాశాలకు వస్తున్నాయని వెల్లడించారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ప్రతి సెమిస్టర్ నిర్వహించే పరీక్షల ఫలితాలలో, మేనేజ్మెంట్ మీట్ వంటి పోటీలలో ఆర్సిఆర్ మేనేజ్మెంట్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలను సాధిస్తున్నారని అన్నారు. ఎంబీఏ విద్యార్థులకు అకాడమిక్ అంశాలతోపాటు ప్రత్యేకంగా గ్రూప్ డిస్కషన్స్, సెమినార్, మేనేజ్మెంట్ గేమ్స్, రియల్ కేస్ స్టడీస్, శాప్, తదితర అంశాలలో శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు. ఎంసీఏ విద్యార్థులకు కళాశాలలో ప్రత్యేకంగా బిగ్ డేటా అనాలసిస్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డాట్ నెట్ టెక్నాలజీస్, ఇంటర్ నెట్ ఆఫ్ థింగ్స్ సబ్జెక్టులతో పాటు అధునాతన ప్రోగ్రామింగ్ కోర్సులైన సి, సి ++ , జావా, ఒరాకిల్, పైతాన్, పి హెచ్ పి, డాట్ నెట్ లలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు వెల్లడించారు. సాధారణ ప్రతిభ కలిగిన విద్యార్థులు తమ కళాశాలలో మేనేజ్మెంట్ కోర్సులో చేరిన తర్వాత క్యాంపస్ ప్లేస్మెంట్లు అత్యుత్తమ ప్రతిభను కనబరిచే ఉన్నతమైన కంపెనీలలో ఉన్నతమైన స్థానాలను (జాబ్ లను) అలంకరిస్తున్నారని పేర్కొన్నారు. తిరుపతి పరిసర ప్రాంతాలలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సులలో ... మేనేజ్మెంట్ కోర్సులో చేరాలనుకునే ఆసక్తి కలిగిన విద్యార్థులు తమ కళాశాలను ఎంచుకోవడం ద్వారా నాణ్యమైన విద్య మీకు అందించబడుతుందని తెలిపారు.

విజ్ఞాన విహారం 'ఇస్రో'

ప్రజాశక్తి-తిరుపతి సిటి

ప్రజాదృష్టి

ఖగోళగుట్టును రట్టు చేసేందుకు పూనుకుంది భారత శాస్త్రసాంకేతిక రంగం. తాను స్వయంగా రూపొందించిన సాంకేతిక యంత్రాలతో విశ్వ విహారానికి నడుంబిగించింది. భారతదేశ ప్రతిష్టను పెంచుతూ, ప్రపంచాన్ని నివ్వెరపరిచే పరిశోధనలకు శ్రీకారం చుట్టింది భారతీయ విజ్ఞాన బాండాగారం ఇస్రో. ఖగోళంలోని గ్రహాలను చుట్టేస్తూ సూర్యచంద్రుల్లోని రహస్యాలను బహిర్గత పరిచే ప్రక్రియను వేగవంతం చేస్తోంది. అగ్రదేశాలకు ఏమాత్రం తీసిపోని స్థాయిలో, ఓ దశలో వాటికి రెట్టింపు స్థాయిలో దూసుకుపోతోంది ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో). అంతరక్ష వారోత్సవాలు (వరల్డ్ స్పేష్ వీక్-2023) సందర్భంగా దేశ విజ్ఞాన ప్రతిభను వినువీధుల్లో విహరింప చేస్తున్న ఇస్రో గొప్పతనాన్ని భావి బారత పౌరులకు తెలియజేసేందుకు పూనుకుంది ఆ సంస్థ. అందులో భాగంగా ప్రతి విద్యాసంస్థల్లో విద్యార్థులకు వారం రోజుల పాటు ఇస్రో ప్రయోగాలపై అవగాహన కల్పిస్తూ, పలు విజ్ఞాన పోటీలు నిర్వహించి, ప్రోత్సాహక బహుతులు అందజేస్తుంది. ఈ సందర్భంగా ఇస్రో గురించి మచ్చుకు కొన్ని మాటలు....

సూర్య చంద్రుల దరిచేరడం ఎవ్వరి తరం కాదు. ఇది ఒకప్పటి మాట. అందానికి మారుపేరు పున్నమి చంద్రుడు. ఆరుబయట వెన్నెల వెలుగులో పడుకుని ఆకాశంలోని పున్నమి చంద్రుని చూస్తే మానసిక ఉల్లాసాన్ని కల్గిస్తుంది. అంతటి అందాన్ని పసిపిల్లలకు అద్దంలో చూపిస్తూ అమ్మలు ఆహారాన్ని అందించడం భారతీయ పురణకథల్లోన్ని సన్నివేశాలు. కానీ అదే భారతీయులు చందమామపై పరిశోధనలకు శ్రీకారం చుట్టారు. భారతీయులు విజ్ఞానంలో ఏ మాత్రం తక్కువ కాదని మరోసారి ప్రపంచానికి చాటారు. చంద్రయాన్-3 ని విజయవంతంగా ప్రయోగించి, ప్రపంచాన్ని అబ్బురపరిచారు. ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి జిల్లా సూళ్లూరుపేట నియోజకవర్గంలోని శ్రీహరికోట ఇస్రో కేంద్రం ఇందుకు వేదికైంది. జూలై14వ తేది చంద్రయాన్‌ను ఇస్రో నుంచి ప్రయోగించి ఆగస్టు 23వ తేది సురక్షితంగా చందమామాపై ల్యాండ్ చేయడంలో విజయం సాధించింది. దానికి ఒక రోజు ముందే రష్యా ప్రయోగించిన ఇదే ప్రయోగం విఫలమైన చోట భారతీయులు విజయం సాధించడం గమనార్హం. ఆ విజయంతో మరో అడుగు ముందుకేసి అదే నెలలో ఆదిత్య ఎల్1ను ప్రయోగించింది. దీని ద్వారా సూర్యుడిపై జరుగుతున్న మార్పులను కనిపెట్టి, దానికి గల కారణాలు, ఇతరత్రా రహస్యాలను బట్టబయలు చేసేందుకు పూనుకుంది. ఆదిత్య ఎల్1 ఇపుడు ఆకాశంలో పయనిస్తూనే ఉంది. ఇదే ఉత్సాహంతో గగన్‌యాన్ ద్వారా మానవసహిత రాకెట్లు ప్రయోగించి, చందమామపై అడుగు పెట్టేందుకు సిద్ధమవుతోంది. ఇలా వరుస విజయాలతో ముందుకెళ్లుతున్న ఇస్రో మరింత మంది భవిష్యత్తు శాస్త్రవేత్తలను తయారు చేసేందుకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా అంతరిక్ష వారోత్సవాల సందర్భంగా ప్రతి ప్రభుత్వ విద్యా సంస్థల్లోని విద్యార్థులకు ఇస్రో విధులు, అందులోని ప్రయోగాలు, వాటి ఫలితాలు, తదితర విషయాలను వివరించి, వారిలో ప్రయోగాలపై ఆసక్తి పెంచేలా చేసి, ఇంజనీర్లుగా మార్చి, శాస్త్రవేత్తలగా తీర్చిదిద్దేలా చేయాలని సంకల్పించింది. అందులో బాగంగా ఈ నెల 4వ తేది నుంచి 10వ తేది వరకు తిరుపతి, చిత్తూరు, నెల్లూరు జిల్లాలోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో స్పేస్ వీక్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో ఈ నెల 7వ తేది టిటిడి సహకారంతో తిరుపతి ఎస్‌జిఎస్ పాఠశాలలో ఇస్రో శాస్త్రవేత్తలు పలు ప్రయోగాల నమూనాలు, వాటి సామర్థ్యం, పనితనం వంటి వాటిని ఫోటోలతో వివరించి, వీడియోల ద్వారా అవగాహన కల్పించారు. దీని ద్వారా విద్యార్థుల్లో శాస్త్రసాంకేతిక రంగంపై మరింత అవగహన కల్పించి, భవిష్యత్తు శాస్త్రవేత్తలను తీర్చిదిద్దాలనే వారి లక్ష్యం నెరవేరాలని ఆశిస్తూ, అందుకు ప్రతి ఒక్కరి సహకారం అందిద్దాం.

డ్రగ్స్ రహిత సమాజ సాధనే లక్ష్యం

- జిల్లా స్పెషల్ ఎంఫోర్స్‌మెంట్ అధికారి రాజేంద్ర

మాట్లాడుతున్న జిల్లా స్పెషల్‌ఎన్‌ఫోర్సుమెంటు అధికారి రాజేంద్ర

ప్రజాశక్తి -తిరుపతి సిటీ : డ్రగ్స్ రహిత సమాజ సాధన లక్ష్యంగా పనిచేయాలని జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంటు అధికారి రాజేంద్ర సూచించారు. జిల్లా సెబ్ అధికారులతో ఆయన శనివారం నేర సమీక్ష నిర్వహించారు. గత నెలలో ఛేదించిన కేసు వివరాలను గురించి తెలుసుకొని, ఆ సమయంలో ఎదురైన సవాళ్లు, లోటుపాట్లను సరి చేసుకుంటూ, రాబోయే బ్రహ్మోత్సవాలు, దసరా సెలవుల సమయంలో మరింత కట్టుదిట్టమైన ప్రణాళిక రూపొందించి ముందుకు వెళ్లి తిరుపతి నగరంతో పాటు జిల్లాలో నాటుసారా, గంజాయి వంటి మత్తు పదార్థాల అవశేషాలు కూడా లేకుండా సమూలంగా అరికట్టేందుకు మనమందరం కంకణం కట్టుకొని, అహర్నిశలు పనిచేయాలని పిలుపు నిచ్చారు. ఖచ్చితంగా పాటించవలసిన ప్రణాళికను సవివరంగా సెబ్ అధికారులకు వివరించి దిశా నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ ఎన్‌ఫోర్సుమెంటు సూపరింటెండెంట్ గూడూరు రమేష్, తిరుపతి జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంటు బ్యూరో అధికారులు సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికలో మహిళా వర్సిటీ విద్యార్థినుల ప్రతిభ

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో ప్లేస్‌మెంట్ అండ్ కెరియర్ కౌన్సెలింగ్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ చైతన్య, భాష్యం విద్యాసంస్థల ప్రాంగణ ఎంపికలో వర్సిటీ విద్యార్థినులు తమ ప్రతిభను చాటారు. సోషియల్ సైన్సెస్ సైన్స్ విభాగాల నుండి మొత్తం 173 మంది విద్యార్థినులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్లేస్‌మెంట్ విభాగం డైరెక్టర్ ఆచార్య ఆర్ ఉష వెల్లడించారు. ఈ సందర్భంగా ఉద్యోగాలు సాధించిన విద్యార్థినులను వర్సిటీ ఉపకులపతి ఆచార్య డి భారతి, ఈసి సభ్యులు ఆచార్య ఎన్ రజిని సోషల్, సైన్స్ డీన్ లు ఆచార్య సుజాతమ్మ, ఆచార్య అనూరా అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉన్నత విద్య అనంతరం విద్యార్థులు తమ ప్రతిభా పాటవాలతో ఉన్నత రంగాల్లో రాణించేందుకు ప్రాంగణ ఎంపికలు మహిళా వర్సిటీలో దోహదపడతాయన్నారు. విద్యార్థులు తమ రంగంలో ఉన్నతంగా రాణించేందుకు మంచి పేరు తీసుకువచ్చేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ ప్రాంగణ ఎంపికలో ఎక్కువ మంది విద్యార్థులు వివిధ క్యాంపస్లలో ఎంపిక కావడం హర్షదాయకమని వీసీ ఆచార్య డి. భారతి అన్నారు. ఈ కార్యక్రమంలో ప్లేస్మెంట్ అండ్ కెరియర్ సెల్ కౌన్సెలింగ్ సెల్, మెంబర్స్ ప్రొఫెసర్ ఎన్. జాన్ సుష్మ, ప్రొఫెసర్ బి.కిషోరి, డాక్టర్ ఇందిరా, డాక్టర్ సుజాత, మాధవి, విద్యార్థినులు పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికలో ప్రతిభ చూపిన విద్యార్థినులు

వన్యప్రాణులను రక్షించుకోకపోతే పర్యావరణానికి పెనుముప్పు: ఎఫ్‌బిఓ

బహుమతులు అందిస్తున్న ఫారెస్టు అధికారులు

ప్రజాశక్తి -సత్యవేడు: వన్యప్రాణులను రక్షించుకోకపోతే పర్యావరణానికి పెనుముప్పు ఏర్పడే అవకాశాలు ఉన్నట్లు తిరుపతి జిల్లా సత్యవేడు అటవీ శాఖ ఎఫ్‌బిఓ వేణుగోపాల్ చెప్పారు. వన్యప్రాణి సంరక్షణ వారోత్సవాలను పురస్కరించుకొని శనివారం మండల పరిధిలోని వరదయ్యపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో వన్యప్రాణి సంరక్షణ పై ప్రధానోపాధ్యాయులు చినబాబు అధ్యక్షతన విద్యార్థులకు అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఎఫ్‌బిఓ వేణుగోపాల్ మాట్లాడుతూ అటవీ జంతువులను వేటాడడం చట్టరీత్యా నేరం అన్నారు. వన్యప్రాణులను వేటాడితే 1972 లో తీసుకొచ్చిన చట్టరీత్యా శిక్షార్హులు గురికావాల్సి ఉంటుందన్నారు. పైగా వన్యప్రాణులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వన్యప్రాణులు అంతరించిపోతే పర్యావరణ సమతుల్యం దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. అందువల్లే జంతుజాలాలు స్వేచ్ఛగా జీవించడానికి అభయారణ్యాలను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసినట్టు ఆయన చెప్పారు. ఇందులోకి సామాన్య ప్రజలు ప్రవేశించడానికి అనుమతి ఉండదన్నారు. జంతు జలాలను కూడా స్వేచ్ఛాయుతంగా జీవించేలా తగిన వాతావరణాన్ని కల్పించాలన్నారు. అనంతరం వన్యప్రాణి వారోత్సవాలను పురస్కరించుకొని వన్యప్రాణుల సంరక్షణపై జరిగిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు.ఈ కార్యక్రమంలో అటవీశాఖ ఎఫ్బిఓ నాగేశ్వర్, ఉపాధ్యాయులు భాస్కరన్,నాగరాజు,అమర్నాథ్ రెడ్డి,హిమ, యామిని కుమారి,స్వర్ణ,పద్మావతి,పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

వృద్ధులకు ఆర్థికసాయం


వృద్ధులకు ఆర్థిక సాయం అందిస్తున్న రమణయ్య

ప్రజాశక్తి -కోట : కోట మండలంలో శ్రీ షిరిడి అక్షయ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వాహకులు అల్లం రమణయ్య ఆధ్వ ర్యంలో ఇద్దరు వృద్ధులు కటికాల నారాయణ, మండే మస్తానమ్మలకు వెయ్యి రూపాయలు చొప్పున ఇద్దరకు రెండు వేల రూపాయలును శనివారం అందించారు. ఈ సందర్భంగా అల్లం రమణయ్య మాట్లాడుతూ శ్రీ షిరిడి అక్షయ సేవా సమితి ఆధ్వర్యంలో వారికి ప్రతి నెలా వెయ్యి రూపాయలు చొప్పున అందజేస్తు న్నామన్నారు. ఎన్నో సంవత్సరాల నుండి అనారోగ్యంతో బాధపడుతూ మందుల చికిత్స నిమిత్తం ఇబ్బందులు పడుతుంటే స్థానికులు అందించిన సమాచారం మేరకు శ్రీ షిరిడి అక్షయ సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతినెలా వెయ్యి రూపాయలు వారికి అందిస్తున్నామని అల్లం రమణయ్య తెలిపారు. ఈ కార్యక్ర మంలో శ్రీ షిరిడి కమిటీ సభ్యులు పన్నగం సాయి పాల్గొన్నారు.

తిరుచానూరులో అన్నదానం

ప్రజాశక్తి -తిరుచానూరు: పెరటాసి మాసాన్ని పురస్కరించుకుని అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు తిరుచానూరులో సర్పంచ్ రామచంద్రారెడ్డి అన్నదానం చేశారు. పెరటాసి మాసం శనివారం కావడంతో భక్తులు పెద్దసంఖ్యలో అన్నదాన శిబిరానికి చేరుకున్నారు. 5వేల మందికి తిరుచానూరు సర్పంచ్ అన్నదానం ఏర్పాటు చేశారు. ఉదయం 7 గంటలకి సుమారు 5వేల మందికి సాంబారు అన్నం, పెరుగు అన్నం తయారు చేశారు. మధ్యాహ్నం అన్నదానం 12 గంటల నుండి 3 గంటల వరకు 2 వేల మందికి నిర్వహించారు. ఈ కార్యక్రమంలోఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖరరెడ్డి , తిరుచానూరు ఎంపిటిసి నరేష్ రెడ్డి, బ్రాహ్మణపట్టు ఎంపిటిసి బి.యోగనందరెడ్డి, ముండ్లపూడి సర్పంచ్ సూరి రెడ్డి, తిరుచానూరు వార్డు మెంబర్ మునేంద్ర రాయల్, చంద్రశేఖర్ ఆజాద్, ఆర్ఆర్ యూత్ పాల్గొన్నారు.

'స్వచ్ఛతహీ సేవ' వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి -తడ: స్వచ్ఛతహీ సేవలో భాగంగా తడ మండలం కాదలూరు గ్రామపంచాయతీలలో ప్రభుత్వ పాఠశాలలో పిల్లలకు వ్యాసరచన, డ్రాయింగ్ కాంపిటేషన్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కాంపిటేషన్ లో మొదటి, ద్వితీయ, తృతీయ గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి ఎల్ శేషారావు, స్కూల్ ప్రిన్సిపాల్ నాగలక్ష్మి, స్కూల్ కమిటీ చైర్మన్ ఆవుల చంద్రశేఖర్ , ఇతర సచివాలయ సిబ్బంది, స్కూల్ సిబ్బంది పాల్గొని పిల్లలకు బహుమతులు అందించారు.

చంద్రబాబు అరెస్టుపై నిరసన

ప్రజాశక్తి - గూడూరు: రిమాండ్ నుంచి చంద్రబాబునాయుడు త్వరగా బయటకు రావాలని కోరుతూ పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ యాగం చేశారు. అనంతకం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో స్కిల్ డెవలప్మెంట్ ను ఏర్పాటు చేసి అనేక మంది నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తే, ఈ ప్రభుత్వం అధికారాన్ని అడ్డం పెట్టుకొని అక్రమ కేసులు బనాయించడం తగదన్నారు. నిరాహార దీక్షలో బాగంగా ఈ రోజు వాకాడు మండలం టిడిపి కుటుంబ సభ్యులతో కలసి దీక్ష చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శీలం కిరణ్ కుమార్, కార్యదర్శి నెలబల్లి భాస్కర్ రెడ్డి, మండల పార్టీ అద్యక్షులు పులిమి శ్రీనివాసరావు,గణపర్తి కిషోర్ నాయుడు,జిల్లా అధికార ప్రతినిధి బిల్లు చెంచురామయ్య,రాష్ట్ర శాలివాహన సభ్యులు కాకి శ్రీనివాసులు, వాకాడు మండల ప్రధాన కార్యదర్శి దోసకాయల కృష్ణ మూర్తి, మారం రెడ్డి,జనార్ధన్ రెడ్డి,మోహన్ రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, నిమ్మకాయల నరసింహులు, మహిళలు గుండాల లీలావతి, మట్టం శ్రావణి రెడ్డి, గుండాల భారతి, శ్రీదేవి, సుధా,్ంవతి, సుబరత్నమ్మ మండల కార్యకర్తలు పాల్గొన్నారు.

నారాయణలో స్పోర్ట్స్ మీట్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని నారాయణ ఇంజనీరింగ్ కాలేజ్ (అటానమస్) లో నారాయణ ప్రొఫెషనల్ కళాశాలలకు స్పోర్ట్స్ మీట్– 2023 శనివారం ఘనంగా నిర్వహించారు. రెండవ రోజు డిస్కస్ త్రో, జవలెన్ త్రో, రిలే పరుగు పందేలు , ఆటల పోటీలు సెమీ ఫైనల్స్, ఫైనల్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ రవి ప్రసాద్ మాట్లాడుతూ రెండవ రోజు 650 మంది విద్యార్థులు నిర్దేశించిన ఆటలలో చురుగ్గా పాల్గొన్నారని తెలిపారు. తమ కళాశాల చదువుతోపాటు క్రీడలకు పెద్దపీట వేస్తుందని దానిలో భాగంగానే ఈ మీట్ నిర్వహించామని తెలిపారు. అనంతరం వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ విశ్వక్సేనారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు క్రీడా పోటీలలో పాల్గొనడం ద్వారా పోటీ తత్వం పెరగడంతో పాటు శారీరక దృఢంగా, ఆరోగ్యంగా ఉంటారన్నారు. అనంతరం విజేతలకు సర్టిఫికెట్లు, షీల్డ్ లను అందించారు. ఈ కార్యక్రమంలో వి.నారాయణ, స్పోర్ట్స్ కన్వీనర్ కేశవరావు ,ఫిజికల్ డైరెక్టర్ రాఘవయ్య, ఏవో కొండారెడ్డి, ఓఎం వెంకటేశ్వర్లు ,అధ్యాప కులు పాల్గొన్నారు.

అంతస్తులు ఎక్కి.. ఆత్మీయత పంచి..

ప్రజాశక్తి - తిరుచానూరు: సాయినగర్ పంచాయతీ పరిధిలో అపార్టుమెంట్ లు అధికంగా ఉండటంతో ప్రతి అంతస్తుకు ఎక్కిన చెవిరెడ్డి లక్ష్మీ ఆత్మీయ పలకరింపుతో తన బిడ్డను ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. ఎంతో ఓపికగా ఐదు అంతస్తుల మేడ కూడా ఎక్కి జనంతో మమేకమైన చెవిరెడ్డి లక్ష్మీ పట్ల స్థానిక ప్రజలు ఆప్యాయంగా పలకరించి ఆప్యాయతను పంచుకున్నారు. చెవిరెడ్డి లక్ష్మీ రాకతో మహిళలు, స్థానిక పార్టీ నేతలు, కార్యకర్తలు హడావుడి చేస్తూ పండుగ వాతావరణం సృష్టించారు.

ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సతీమణి లక్ష్మీ

21న లోక్ అదాలత్‌ను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఈ నెల 21న శ్రీకాళహస్తి కోర్టు ఆవరణలో జరిగే ప్రత్యేక లోక్ అధాలత్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని 12 వ అదనపు జిల్లా జడ్జి ఎం శ్రీనివాసులు నాయక్, శ్రీకాళహస్తి సీనియర్ సివిల్ జడ్జి బేబీ రాణి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జ్ కృష్ణప్రియ పిలుపునిచ్చారు. స్థానిక కోర్టు ఆవరణలో శనివారం న్యాయమూర్తులు రెవెన్యూ అధికారులతో సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో న్యాయ వాదులు దశరథ రామ్ రెడ్డి, శేఖర్, పలువురు తహశీల్దార్లు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి -తిరుచానూరు: తిరుచానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బాక్సింగ్ ఛాంపియన్ రాష్ట్ర స్థాయి జట్టును ఎంపిక చేశారు. అండర్ 14, అండర్ 17, అండర్ 19 బాల, బాలికల రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక నిర్వహించారు. ఈ కార్యక్రమం ఉదయం 10 గంటలకు ప్రధానోపాధ్యాయులు మురళి అధ్యక్షతన ప్రారంభోత్సవం జరిగింది. తిరుచానూరు సర్పంచ్ రామచంద్రారెడ్డి భోజనం సదుపాయం కల్పించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని వివిధ పాఠశాలల నుండి 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. సాయంత్రం ఐదు గంటలకు ముగింపు సమావేశం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ శేఖర్ విచ్చేసి ఎంపికైన క్రీడాకారులకు మెడల్స్ ను బహుకరించారు. విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల మానసిక శారీరక వికాసానికి తోడ్పడతాయని తెలిపారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందిం చుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్ జి ఎఫ్ అధ్యక్షులు విజయ కుమారి కార్యదర్శి, బాబు, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షులు సుబ్రహ్మణ్యం రెడ్డి, ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి ఎస్ వెంకట ముని, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా యద్దల నరేంద్ర రెడ్డి జన్మదినం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గూడూరు మండలం వైసీపీ సీనియర్ నాయకులు యద్దల నరేంద్ర రెడ్డి జన్మ దిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉమ్మడి నెల్లూరు జిల్లా స్థానిక సంస్థల శాసన మండలి సభ్యులు, శాసన మండలి విప్ మేరిగమురళీధర్ పాల్గొన్నారు. గూడూరు ఎంపీపీ గురవయ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్సీ మురళీధర్ గూడూరు మండల పరిధిలోని మండల నాయకులు, కార్యకర్తలతో కలిసి 40 కేజీల భారీ కేక్ ను కట్ చేసి అందరికి పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ మాట్లాడుతూ ప్రముఖ పారిశ్రామికవేత్త ,వైసీపీ సీనియర్ నాయకులు నరేంద్ర రెడ్డి సార్వత్రిక ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికలలో పార్టీ గెలుపునకు కృషి చేశారన్నారు. గూడూ రు మండలం లో వైసీపీ బలోపేతానికి కృషి చేసిన వ్యక్తి అని కొని యాడారు. ఆయ న భవిష్యత్ లో మరెన్నో పుట్టిన రోజు లు జరుపు కోవాలని ఆకాంక్షించారు. భవిష్యత్ లో మరెన్నో ఉన్నత పదవులు చేపట్టాలని పేర్కొన్నారు. అనంతరం భారీ అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గూడూరు ఎం.పి.పి గురవయ్య , వైసీపీ నాయకులు కొండూరు సునీల్ రెడ్డి , మహేంద్ర యాదవ్, ప్రభాకర్ రాజు, కొట్టు గోవర్ధన్, గోపి యాదవ్, బల్లి వెంకటేశ్వర్లు, రవి రాజు, ఇనమళ్ళ శీనయ్య, శ్రీకిరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, కృష్ణా రెడ్డి దయాకర్, పనీంద్ర రెడ్డి, అల్లం వెంకటేశ్వర్లు, పలు గ్రామాల సర్పంచ్ లు, ఎంపీటీసి లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యద్దల నరేంద్ర రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న వైసీపీ నాయకులు

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కోట: రానున్న సీజనల్ సమయాలలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పై శ్రద్ధ వహించాలని వైసీపీ గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్ రావు అన్నారు. శనివారం కోట మండలంలోని నెల్లూరు పల్లి కొత్తపాళెం పంచాయతీ పరిధిలో ఉన్న హైస్కూల్ లో వైసీపీ యువ నాయకులు నేదురుమల్లి హరీష్ చంద్రా రెడ్డి ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం ఈ కార్యక్రమం అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్ రావు హాజరయ్యారు. పంచాయతీ పరిధిలో అనారోగ్యంతో బాధితులకు ఇలాంటి పథకాలు మరెంతగానో ఉపయోగపడుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ యువ నాయకులు నేదురుమల్లి హరీష్ చంద్రా రెడ్డి, సర్పంచ్ బందిల ప్రసన్న, వైసీపీ కోట మండల కన్వీనర్ పల్లగాటి సంపత్ కుమార్ రెడ్డి, కోట బిట్ 2 ఎంపిటిసి షేక్ మొబీన్ బాష, శానంపూడి గోపాల్ రెడ్డి, కట్టా శంకర్ రెడ్డి, నేదురుమల్లి హరిప్రసాద్ రెడ్డి, గాలి శ్రీనివాసులు రెడ్డి, హర్ష వర్ధన్ రెడ్డి, ఎమ్ డిఓ భవాని, ఎమ్ఈ ఓ మస్తానయ్య, ఎంపిపి దాసరి అంజమ్మ, వైసీపీ సీనియర్ నాయకులు చేవూరి నాగేశ్వరావు వైద్య, సచివాలయం, అంగన్వాడీ, విద్యుత్ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరప్రసాద్

ఘనంగా ఎల్ఐసి యానియన్ వార్షిక సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలోని స్థానిక ఎల్ఐసి కార్యాలయ ఆవరణలో బ్రాంచ్ ఎల్ఐసి యూనియన్ 31వ వార్షికోత్సవ సమావేశంను ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా యూనియన్ 31వ సర్వసభ్య నెల్లూరు డివిజన్ ప్రధాన కార్యదర్శి ప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు ప్రభుత్వరంగ సంస్థలు ఎదుర్కొంటున్న గడ్డు పరిస్థితులను తెలిపారు. భవిష్యత్తులో ఐక్య పోరాటాలు చేపట్టాల్సిన అవశ్యకత గురించి తెలిపారు. అనంతరం యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బ్రాంచ్ యూనియన్ అధ్యక్షులుగా డి. దస్తగిరి, కార్య దర్శిగా ఎన్ లక్ష్మణ కుమార్, ఉపాధ్యక్షులుగా వెంకటేశ్వర్, సహాయ కార్యదర్శులుగా వేలాయుధం, కోశాధికారిగా షణ్ముగం, కార్యవర్గ సభ్యులుగా రమేష్, రామకృష్ణ, మహావాణి లను ఎన్నుకొన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు డివిజన్ అధ్యక్షులు సుందర్ బాబు, సహా య కార్యదర్శి ఎస్ఇద్, ఉద్యోగులు పాల్గొన్నారు.

అమరరాజా విద్యాలయం పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి -రేణిగుంట: రేణిగుంట మండలం కరకంబాడి అమర రాజా విద్యాలయంలో ఘనంగా శనివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి ముఖ్యఅతిథిగా అమర హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ గౌరినేని రమాదేవి ముఖ్య అతిథి గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి సంవత్సరం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరగాలని పాఠశాలకు పూర్వ విద్యార్థులు అనుబంధంగా ఉండాలని, మనమందరం సమాజానికి ఉపయోగపడే మంచి పనులను కలిసికట్టుగా చేయాలని తెలిపారు. పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ 1995లో ప్రారంభమైన ఈ విద్యా సంవత్సరం 2023 వరకు అంచలంచెలుగా ఎంతో అభివృద్ధి చెందింది. ఇలాంటి పాఠశాలలో చదివినందుకు మాకు ఎంతో సంతోషంగా ఉందని, విలువ లతో కూడిన విద్య ను నేర్చుకున్నామని ఈ రోజు చాలామంది ఉన్నత స్థాయిలో ఉన్నామని, ఇలాంటి గొప్ప వేదికను కల్పించినందుకు చైర్మన్ గల్లా రామచంద్ర నాయుడుకిపూర్వ విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

108 లో ప్రసవం..తల్లీబిడ్డ క్షేమం

ప్రజాశక్తి-వరదయ్యపాలెం: 108 అంబులెన్స్ లో పండంటి ఆడబిడ్డను ప్రవించిన ఘటన మండలంలో శనివారం చోటు చేసుకుంది. ఆనందపురం గ్రామం ఎస్టీ కాలనీకి చెందిన వెన్నెల పురిటి నొప్పులు అధికమవడంతో కుటుంబ సభ్యులు 108 కి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఈఎంటి నాగరాజు, పైలట్ వెట్టి.భాస్కర్, వరదయ్యపాలెం మండలం చిన్నపాండూరు గవర్నమెంట్ హాస్పిటలుకు గర్భిణీని తరలిస్తుండగా మార్గమధ్యంలో పురిటి నొప్పులు ఎక్కువ అవడంతో 108 సిబ్బంది కుటుంబ సభ్యుల సహకారంతో అంబులెన్స్ లో సాధారణ ప్రసవం చేశారు. పండంటి ఆడబిడ్డ జన్మించింది. తల్లి, బిడ్డ ఇద్దరు క్షేమంగా ఉండడంతో వారిని చిన్న పాండురు గవర్నమెంట్ హాస్పిటల్ లో చికిత్స నిమిత్తం చేర్పించారు. సకాలంలో స్పందించి, ప్రసవ సమయంలో చాకచక్యంగా వ్యవహరించి ప్రసవం చేయడం తల్లి బిడ్డలు క్షేమంగా ఉండడంతో పేషెంట్ బంధువులు, స్థానికులు 108 సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

అవినీతి వైసిపి ప్రభుత్వాన్ని గద్దె దింపుతాం : మాజీ ఎంపీపీ

ప్రజాశక్తి రామచంద్రపురం: రాష్ట్రంలోని అవినీతి అరాచక పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించుదామని మాజీ ఎంపీపీ డి బిందు మాధవి పిలుపునిచ్చారు. శనివారం అనుపల్లి గ్రామంలో మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా కాంతితో క్రాంతి కార్యక్రమాన్ని కొవ్వొత్తులు వెలిగించి మద్దతుగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం, అప్పులు, అరాచక, కుట్ర పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. వైసిపి ప్రభుత్వం స్కిల్ డెవలప్మెంట్ కేసులో చంద్రబాబుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు చూపకుండా అరెస్టులు చేయడం శోచనీయమన్నారు. రానున్న శాసనసభ ఎన్నికలలో టిడిపి, జనసేనలు ఘనవిజయం సాధించడం ఖాయమన్నారు. అక్రమంగా అరెస్టు చేసిన నారా చంద్రబాబు నాయుడిని వెంటనే విడుదల చేయాలని టిడిపి నాయకులు ఎన్. మునిరత్నం నాయుడు. బండి విజయ్ కుమార్ రెడ్డిలు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పి వెంకటేష్ నాయుడు, బి కోటి రాయల్, వి కృష్ణమూర్తి, కే మోహన్ రెడ్డి, ఎం రాము, ఆకా దేవరాజులు. ఆర్ చెన్నకేశవులు, ఎం వెంకటరత్నం పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పై శ్రద్ధ వహించాలి:ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కోట : రానున్న సీజనల్ సమయాలలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పై శ్రద్ధ వహించాలని వైసీపీ గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్ రావు అన్నారు. ఈ సందర్భంగా శనివారం కోట మండలంలోని నెల్లూరు పల్లి కొత్తపాళెం పంచాయతీ పరిధిలో ఉన్న హైస్కూల్ లో వైసీపీ యువ నాయకులు నేదురుమల్లి.హరీష్ చంద్రా రెడ్డి ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం ఈ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్ రావు హాజరయ్యారు.అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వై ఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన ఇలాంటి మహోన్నతమైన పథకం మర్చిపోలేనిదని కొనియాడారు. పంచాయతీ పరిధిలో అనారోగ్యంతో ఉండే ప్రతిఒక్కరికి ఇలాంటి పథకాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. కొన్ని రోజులు క్రితం వాలంటీర్లచే ఇంటింటికి వెళ్లి అనారోగ్యంతో ఉండే బాధితుల లిస్ట్ ను నమోదు చేసి ప్రస్తుతం అలాంటి వారందరకి సంబంధించిన వైద్యులు చికిత్స, పరీక్షలు నిర్వహించి మందులు అందించారన్నారు. ఆరోగ్యం పట్ల ప్రథమంగా ముందుస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య, అంగన్‌వాడీ, విద్యుత్, తదితర వాటిని సకాలంలో సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో వైసీపీ యువ నాయకులు నేదురుమల్లి. హరీష్ చంద్రా రెడ్డి,సర్పంచ్ బందిల ప్రసన్న, వైసీపీ కోట మండల కన్వీనర్ పల్లగాటి సంపత్ కుమార్ రెడ్డి, కోట బిట్ 2 ఎంపిటిసి షేక్ మొబీన్ బాష, శానంపూడి గోపాల్ రెడ్డి, కట్టాశంకర్ రెడ్డి, నేదురుమల్లి హరిప్రసాద్ రెడ్డి,గాలి శ్రీనివాసులు రెడ్డి,హర్ష వర్ధన్ రెడ్డి,ఎమ్ డిఓ భవాని, ఎంఈ ఓ మస్తానయ్య,ఎమ్ పిపి దాసరి, అంజమ్మ, వైసీపీ సీనియర్ నాయకులు చేవూరి నాగేశ్వరావు, వైద్య, సచివాలయం, అంగన్‌వాడీ, విద్యుత్ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.

సదరమ్ సర్టిఫికెట్లుకు దివ్యాంగులు అప్లై చేసుకోవాలి

ప్రజాశక్తి- చిన్నగొట్టిగల్లు: ప్రభుత్వం సదరమ్ సర్టిఫికెట్లు పొందేందుకు దివ్యాంగ అభ్యర్థులకు అవకాశం కల్పించిందని ఎంపిడిఓ దేవేందర్ బాబు తెలిపారు. ఇందుకు అక్టోబర్, నవంబరు, డిసెంబర్ నెలలకు స్లాట్లు విడుదలయ్యాయని, గ్రామ సచివాలయాల్లో అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అభ్యర్థులకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆర్థోపెడిక్, మానసిక, కంటి, ఈఎన్టీ పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్లు అందిస్తారని దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైసిపి నేతకు మాతృ వియోగం

- ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం నివాళి

శకుంతల భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

ప్రజాశక్తి - పిచ్చా టూరు: పిచ్చాటూరు వైసిపి మండల ఉపాధ్యక్షులు వి సుబ్రహ్మణ్యం తల్లి శకుంతల శుక్రవారం రాత్రి అనారోగ్యంతో మరణించారు. సమా చారం అందుకున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పిచ్చాటూరులోని శకుంతల స్వగృహానికి చేరుకొని ఆమె భౌతిక కాయానికి గజమాలతో నివాళిలు అర్పించారు. అనంతరం ఆమె కుమారుడు వైసిపి మండల ఉపాధ్యక్షులు సుబ్రహ్మణ్యం ను, ఆమె కోడలు ఏఎంసి డైరెక్టర్ నళిని లను ఓదార్చి పార్టీ అండగా ఉంటుంది భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల పార్టీ అధ్యక్షులు కే వెంకట చలపతి రాజు, రాష్ట్ర కార్యదర్శి భాస్కర్ నాయుడు, ఎంపీటీసీ రమేష్ రాజు, తొప్పయ, కిరణ్ కుమార్, వెంకటేష్ పాల పద్మనాభం, వైసిపి నాయకులు మోహన్ రెడ్డి, త్యాగరాజు, శరత్ నాగరాజు పాల్గొన్నారు.

టిఎన్ఎస్ఎఫ్ రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసిస్తూ టిఎన్ఎస్ఎఫ్ మండల అధ్యక్షులు శ్రీరామ్ నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడు తూ చంద్రబాబు నాయుడు ఈ రాష్ట్ర భవిష్యత్తు కోసం అహర్నిశలు కష్టపడుతుంటే ఎలాంటి ఆధారం లేని స్కిల్ డెవలప్మెంట్ కేసుల్లో అరెస్టు చేసి జైల్లో నిర్బంధించడం అప్రజాస్వామికమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు పట్టణ టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు ఆడుసుమల్లి నవీన్, వడమాలపేట అధ్యక్షులు చైతన్య, నగిరి టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు అశోక్, విజయపురం టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు దిలీప్, చిత్తూరు పార్లమెంట్ టిఎన్ఎస్ఎఫ్ సెక్రటరీ ప్రకాష్ పా ల్గొన్నారు.

ఎన్‌సిసిలో మంచి క్రమశిక్షణ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ఎన్ సి సి నాయకత్వంలో మంచి క్రమశిక్షణ దేశభక్తి అలవడుతాయని పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు. ఎన్‌సిసి భారత సాయుధ దళాలకు చెందిన విద్యార్థి విభాగం ఎన్‌సిసి పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్సిసి విద్యార్థికి అభి నందన సత్కారం ప్రిన్సిపాల్ శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇటీవల స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పుత్తూరు లో బి.కామ్ (తృతీయ సంవత్సరం) చదువుతున్న ఆర్ఎస్ ఇలంగోవన్ అఖిలభారత సైనిక క్యాంపు శిక్షణకు ఎంపికై అక్కర ఉత్తమ ప్రతిభను ప్రదర్శించి ఉత్తమ పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఇళంగోవన్ చూపిన ప్రతిభను కళాశాలకు, తల్లిదండ్రులు మంచి పేరు తెచ్చాడ న్నారు. అనంతరం ఇళంగోవన్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎన్ సి.సి అధికారి ఎం శ్రీనివాసులు, సీనియర్ అధ్యాపకులు, ఏ దేవకి, వాసవి జి గంగయ్య, జీ తిరుమలయ్య, అధ్యాప కులు ఎన్.సి.సి కాడెట్లు విద్యార్థిని విద్యార్థులు. వైస్ ప్రిన్సిపాల్ వి వీరయ్య, పాల్గొన్నారు.

సాంస్కృతిక ప్రదర్శనలతో నిరసన

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: చంద్రబాబు అరెస్టుని ఖండిస్తూ టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి నెమళ్ళూరు బుజ్జి ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఎన్టీఆర్ భవన్ వద్ద సాంస్కృతిక ప్రదర్శనల ద్వారా నిరసన తెలిపారు. బాబుతో మేము సైతమంటూ కళాకారులు రిలే నిరాహారదీక్షకు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయ కుమార్, గాలి మురళీ నాయుడు, దశరధాచారి, రెడ్డివారి గురువారెడ్డి పాల్గొన్నారు.

వెంకటగిరి: నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా వెంకటగిరి నియోజకవర్గ టిడిపి నాయకులు డాక్టర్ మస్తాన్ యాదవ్ ఇటీవల రెండు కార్యక్రమాలు నిర్వహించారు. చంద్రబాబు నాయుడు ఆయురారోగ్యాలతో ఉండాలని కడిగిన ముత్యంలే త్వరగా విడుదల కావాలని చంద్రన్న కోసం చండీయాగం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాష్ట్రాన్ని బోడిగుండుగా మార్చిన ఈ జగన్మోహన్ రెడ్డికి నిరసనగా ఆధ్వర్యంలో అరగుండు కార్యక్రమం నిర్వహించి చంద్రబాబుకుకి మద్దతు తెలిపారు.

వైసిపి నాయకుల సమావేశం

ప్రజాశక్తి - ఓజిలి : రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని మరొక్కసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని సూళ్లూరుపేట శాసనసభ్యులు కిలివేటి సంజీవయ్య పేర్కొన్నారు. జగనన్న సీఎం ఎందుకు కావాలి? అనే కార్యక్రమాన్ని మండల కన్వీనర్ పాదర్తి హరినాథ్ రెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని వైసిపి నాయకులతో సూళ్లూరుపేట శాసనసభ్యులు కిలివేటి సంజీవయ్య శిక్షణ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యులు గుంటమడుగు రవీందర్ రాజు, కో ఆప్షన్ సభ్యులు ఖాదర్ బాషా , వైస్ ఎంపీపీ లెక్కల ప్రసాద్ నాయుడు, సొసైటీ అధ్యక్షులు రాజారాం రెడ్డి , దేశి రెడ్డి మధుసూదన్ రెడ్డి , ఉచ్చూరు హరినాథ్ రెడ్డి , ముమ్మడి సుబ్బారావు యాదవ్ , పిండుకూరు మధుసూదన్ రెడ్డి , గుడ్ల వెంకటరెడ్డి, సుబ్రహ్మణ్యం రాజు , కొండూరు దామోదర్ రాజు , ఈశ్వర్ రాజు రామచంద్ర రాజు ప్రసాద్ నాయుడు ,సర్పంచులు సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో కారు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి- పుత్తూరు టౌన్ : రోడ్డు ప్రమాదంలో కారు ఢీకొని ఢీకొనడంతో మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు నాగలాపురం మండలం వెల్లూరు దళితవాడ గ్రామానికి చెందిన నిధి దాస్ (49) ఆయన గత కొద్ది రోజులుగా తిరుపతి సమీపంలో కూలి పని చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఇతను తన బంధువులను చూడాలని వారి దగ్గరకు వెళ్లారు. నిధిదాస్ కాలినడకతో నగరి మండలం కాకవేడుకు వెళుతున్న సమయంలో పుత్తూరు మండలం పరమేశ్వర మంగళం కేకేసి కళాశాల సమీపంలో వెళుతుండగా తిరుపతి వైపు నుంచి నగరి వైపు వెళుతున్న కారు. నిధి దాసును ఢీకొనడంతో తనకు తీవ్రంగా గాయాలు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా వెంటనే ప్రమాదం జరిగిన స్థలం వద్దకు చేరుకొని పరిశీలించి ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని దగ్గరలో ఉన్న నగరి హాస్పిటలుకు తరలిస్తుండగా మార్గం మధ్యంలోనే మృతి చెందాడు. మృత దేహాన్ని పుత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించిపోస్టుమార్టం నిర్వహిస్తున్నారు. పోలీసులు ఎస్ఐ గౌరీ శంకర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సూళ్లూరుపేట ఎస్ఐగా వి బ్రహ్మనాయుడు

ప్రజాశక్తి -సూళ్లూరుపేట

తిరుపతి జిల్లా సూళ్లూరుపేట ఎస్ఐగా బ్రహ్మనాయుడుని నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. గూడూరు రూరల్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న వి బ్రహ్మనాయుడు బదిలీలపై సూళ్లూరుపేటకు రానున్నారు. సోమవారం బ్రహ్మనాయుడు ఎస్ఐగా 9 వ తేదీ బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం. సూళ్లూరుపేటలో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ రవిబాబును తిరుపతి విఆర్ ఆఫీసుకి బదిలీ చేశారు.

చంద్రబాబు అరెస్టుపై అఖిలపక్ష సమావేశం

ప్రజాశక్తి - పుత్తూరు:

చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టు కు పుత్తూరులో అఖిలపక్ష పార్టీ నాయకులు కలసి రౌండ్ టేబుల్ సమావేశం. శనివారం నిర్వహించారు. గంటలకు పుత్తూరు జనసేన ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ అఖిలపక్షం సమావేశాన్ని అన్ని రాజకీయ పార్టీలతో ఏర్పాటు చేస్తూ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అరెస్టును తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు జనసేన నాయకుడు ఏపీ రాష్ట్ర కాపు సంక్షేమ సేన ఆర్గనైజింగ్ సెక్రటరీ గోపి రాయల్ ఆధ్వర్యంలో జరిగిన టిడిపి సమావేశంలో పుత్తూరు పట్ల అధ్యక్షులు కౌన్సిలర్ గాలి జీవ రత్నం నాయుడు, ఎన్ ఎన్ ధనపాల్ ముస్లిం మైనారిటీ నాయకుడు హమీద్ భాష, పుత్తూరు రూరల్ మండలం టిడిపి అధ్యక్షుడు రవికుమార్, బాలాజీ, ముస్లిం నాయకుడు మహమ్మద్ రఫీ, తడుకు పంచాయతీ సర్పంచ్ బొబ్బిలి యాదవ్, ఆదిమండడి, టిడిపి రావిళ్ళ మాధవ్ నాయుడు, బిజెపి పార్టీ పుత్తూరు అధ్యక్షుడు ఎల్ అండ్ టి శ్రీధర్ నాయుడు, ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎస్ పురుషోత్తం బబ్లు, పలువురు అఖిలపక్ష నాయకులు పాల్గొన్నారు.

వెంకటగిరి ఇవోపిఆర్‌డి బదిలీ

ప్రజాశక్తి-వెంకటగిరి: వెంకటగిరి ఈవో పి ఆర్ డి శివశంకర్ వెంకటగిరి నుండి నిజాంపట్నం కు బదిలీ అయ్యారు. గత సంవత్సర కాలంగా వెంకటగిరిలో పనిచేసిన ఈయన శనివారం బదిలీ కావడంతో స్థానిక మండల కార్యాలయం సిబ్బంది పంచాయతీ సెక్రెటరీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకటగిరిలో పనిచేసే వెంకటగిరిలోనే రిటైరా ఇవ్వాలని ఉద్దేశంతో ఇక్కడికి వచ్చానని కానీ కొన్ని కారణాల వల్ల అనివార్యమైనప్పుడు ఇక్కడి నుండి బదిలీపై వెళు తున్నప్పటికీ సిబ్బంది తనకు అన్ని విధాల సహకరించాలని వారిని వదిలి వెళ్లడం బాధగా ఉందని తెలిపారు. గత పోలేరమ్మ జాతర సమయంలో వెంకటగిరి కి వచ్చానని ఈ ఏడాది జాతర తరువాత ఇక్కడ నుండి వెళుతున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ సీనియర్ నేత తమ్మిరెడ్డి శివారెడ్డి, సర్పంచులు ఎన్ఆర్జీసీ సిబ్బంది, పంచాయతీ సెక్రెటరీ పాల్గొన్నారు.

IN THE COURT OF THE II ADDITIONAL DISTRICT JUDGE:MADANAPALLE
A.S.No. 36 of 2018
O.S.No. 116 of 2008
(On the file of the I Additional Junior Civil Judge, Madanapalle)
Madduri Reddeppa Reddy.
...Appellant/Plaintiff
Versus
Pamulri Sreeramulu Reddy and Others.
...Respondents/Defendants
NOTICE TO THE 4th RESPONDENT
To,
Poreddy Ramalakshmamma, W/o P.Raja Reddy, Gandhipuram, Tirupathi Town, Tirupathi District.
Please take notice that the Appellant has flied the above Appeal Aggrieved by the Impugned decree and judgment dated 23-01-2018 passed by the learned I Additional Junior Civil Judge, Madanapalle In O.S.No.116/2008 In respect of the suit schedule Property against the respondents Including you. The above appeal on the file of II-Additional District Court, Madanapalle is posted to 20-10-2023 for your appearance by 10.30 a.m Hence you can appear either in person or through your counsel and file your objections If any, lest the matter will be decided exparte against you.
//By Order of the Court//
S. RAJENDRA, B.A., L.L.B.,
Advocate for Appellant
MADANAPALLE.